సాక్షి
నిజామాబాద్
మంగళవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2023



నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు
తెలంగాణ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు.
- 8లో ▸



ప్రజావాణికి 80 ఫిర్యాదులు
ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 80 ఫిర్యాదులు వచ్చాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0 /18.9
ఉదయం మంచు కురుస్తుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీయవచ్చు.

న్యూస్‌రీల్

రెండు లక్షల మందికి కంటి పరీక్షలు

- డీఎంహెచ్‌వో సుదర్శనం



నిజామాబాద్ సిటీ: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,04,550 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి సుదర్శనం సోమవారం వెల్లడించారు. జిల్లాలో గతనెల జనవరి 19న కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 84 గ్రామాల్లో పరీక్షలు పూర్తికాగా, 48 గ్రామాల్లో శిబిరాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 52 వార్డుల్లో శిబిరాలు పూర్తి చేయగా, 22 వార్డుల్లో కొనసాగుతున్నట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,04,550 మందికి కంటి శిబిరాలలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో మగవారు 88,290 మంది, ఆడవారు 1,16,260 మంది ఉన్నారన్నారు. రీడింగ్ గ్లాసులు 40 ఏళ్ల లోపు గల 3,895 మందికి, 40 ఏళ్ల పైబడిన 30,597 మందికి మొత్తం 34,492 మందికి పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 1,419 మందికి దూరం చూపు అద్దాలు పంపిణీ చేశామని, ఇంకా 28,272 అద్దాలు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు.

రేపటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో ఈ ఏడాదికి గాను గొర్రెలు, మేకలకు రెండో విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి నెలాఖరు వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో గొర్రెలు, మేకలు కలిపి మొత్తం 8,2,168 ఉన్నాయని, జిల్లాలోని ప్రతి గ్రామంలో పశువైద్య బృందాలతో నట్టల నివారణకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కావున గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కాళేశ్వరం 21 ప్యాకేజీ' ట్రయల్ రన్



జక్రాన్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు 21వ ప్యాకేజీలో భాగంగా సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌజ్ నుంచి కాళేశ్వరం నీటిని పైప్‌లైన్ ద్వారా జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్, చింతలూర్ గ్రామాల మధ్య నిర్మించిన చెక్ డ్యాంలోకి నీటిని వదిలారు. పంట పొలాల్లో అక్కడక్కడా లీకేజీలు ఏర్పడ్డాయి. చెక్ డ్యాం వద్ద నీటిని చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు జక్రాన్‌పల్లి మండలానికి కాళేశ్వరం నీళ్లు వస్తుండడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



నిజామాబాద్‌నాగారం: వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు తెలిపారు. సోమవారం జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో, హాస్టళ్లలో నాణ్యమైన ఆహారంతో పాటు విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. వేసవిలో తాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం ఎఫ్‌సీ నిధులకు సంబంధించి పనులు మార్చి 31లోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ కమిటీ చైర్మన్ దాసరి ఇందిర, జెడ్పీ సీఈవో గోవింద్, సభ్యులు మ్యాక విజయ, అంబర్‌సింగ్, నర్సవ్వ, అధికారులు పాల్గొన్నారు.

చర్చేలేని బడ్జెట్..!



నిజామాబాద్ నగర కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు

- తూతూ మంత్రంగా సాగిన కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం
- అధికార పార్టీకి మెజారిటీ ఉండడంతో ఆమోదం
- రూ. 272 కోట్ల 72 లక్షల 5వేల అంచనా బడ్జెట్‌కు ఆమోద ముద్ర
- రోడ్లు, డ్రెయినేజీల అస్తవ్యస్తంపై నోరు విప్పింది ఒకరిద్దరే
- మౌనం వహించిన బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగర కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాన్ని మమ అనిపించేశారు. సోమవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశం కేవలం రెండు గంటల్లో ముగిసింది. అధికార పార్టీకి మెజారిటీ ఉండడంతో ఎలాంటి చర్చలు లేకుండా బడ్జెట్‌కు ఆమోదం తెలిపి ముగించేశారు. కేవలం ఒకరిద్దరు కార్పొరేటర్లు మాత్రమే రోడ్లు, డ్రెయినేజీల సమస్యలను ప్రస్తావించారు. సమావేశానికి మేయర్ దండు నీతూ కిరణ్ అధ్యక్షత వహించగా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు.

సమస్యలపై ప్రస్తావనేది..!

నగర పాలక సంస్థ బడ్జెట్ కనీసం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలి. చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నా.. డ్రెయినేజీ వ్యవస్థ దారుణంగా ఉన్నా.. ప్రభుత్వ భూమి, పార్కులు కబ్జాకు గురవుతున్నా.. చర్చ కరువైంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నుకున్నా ప్రజాప్రతినిధులు ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలపై కనీసం ప్రస్తావించలేదు. ఒక్కరిద్దరు కార్పొరేటర్లు మాత్రమే తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలపై నోరు విప్పారు. కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్ ఒక్కరే పలు సమస్యలపై నోరు విప్పినా.. అధికారులు సమాధానం చెప్పలేకపోయారు.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బిగాల, మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. ఇక ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ కార్పొరేటర్లు సైతం మౌనంగా ఉండిపోయారు.



పాల్గొన్న ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ తదితరులు

చీకటి ఒప్పందంతోనే మౌనమా !

సమావేశంలో సమస్యలపై చర్చించకుండా అధికార పార్టీ నగరంలోని కార్పొరేటర్లతో చీకటి ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆయా డివిజన్లకు పెద్ద ఎత్తున నిధులు ఇస్తామని, సమావేశంలో ఆందోళనలు చేయకుండా ఆమోదం పొందే విధంగా చూడాలని ఒక్కరోజు ముందుగానే ఒప్పందం జరిగిందని పలువురు చర్చించుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు మౌనంగా ఉండడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. డివిజన్లను అభివృద్ధి చేసేందుకు నిధుల కోసం పోటీ పడాల్సిన వారే మౌనంగా ఉండడం వెనుక అంతర్యమేమిటో తెలియడంలేదు!

2023 -24 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్‌తో పాటు, 2022 - 23 సవరించిన అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు.

2022 ఏప్రిల్ 01 నాటికి ప్రారంభ నిల్వ	రూ. 8257.68 లక్షలు
2022-23 సవరణ అంచనా సాధారణ ఆదాయం	రూ. 8777.10 లక్షలు
మొత్తం	రూ. 17034.78 లక్షలు
2023 - 24 అంచనా సాధారణ ఆదాయం	రూ.17303.77 లక్షలు
అంచనా వ్యయం	రూ. 9007.44 లక్షలు
మిగులు	రూ. 8296.33 లక్షలు
2023 - 2024 అంచనా క్యాపిటల్ ఆదాయం	రూ. 17127.65 లక్షలు
డిపాజిట్ లోన్ ద్వారా వచ్చే అంచనా ఆదాయం	రూ. 1120.00 లక్షలు
మున్సిపల్‌కు వచ్చే అంచనా ఆదాయం	రూ. 90 కోట్ల 24లక్షలు
మొత్తం అంచనా ఆదాయం	రూ. 272 కోట్ల 72 లక్షల 5 వేలు



బడ్జెట్ పత్రాలు చించేసిన కాంగ్రెస్ కార్పొరేటర్

బడ్జెట్‌లో సమావేశం అనంతరం న్యూ అంబేడ్కర్ భవన్ బయట కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్ బడ్జెట్ పత్రాలను చించేశారు. ఈ సందర్భంగా ఆందోళనకు దిగారు. మున్సిపల్ బడ్జెట్‌తో ఎలాంటి లాభం లేదన్నారు. నగర ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మీడియాను లోపలికి అనుమతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిపై కనీస శ్రద్ధ పెట్టకపోవడం దారుణ మన్నారు. జీజీహెచ్‌లో నాలుగు నెలలుగా సీటీ స్కాన్ చెడిపోయినా మరమ్మతులు చేయించడం లేదన్నారు. కొత్తగా సీటీస్కాన్, ఎంఆర్‌ఐ తెప్పించడం లేదని పేర్కొన్నారు.

“ సమస్యలు చర్చించకుండానే ఆమోదం



బడ్జెట్ సమావేశం నామమాత్రంగా సాగింది. నగర సమస్యలు చర్చించకుండా మెజారిటీ ఉందని అధికార పార్టీ ఆమోదం తెలిపింది. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ భవనం, ట్యాంక్ బండ్ నిర్మాణం, జనరల్ శ్మశాన వాటిక అభివృద్ధి, నాన్‌వెజ్ మార్కెట్, ఎల్లమ్మగుట్ట బ్రిడ్జి పనులపై ప్రసావించాను. డబుల్ బెడ్‌రూం, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఊసే లేదు. సమావేశం తూతూ మాత్రంగా జరిగింది.

– న్యాలం రాజు, బీజేపీ కార్పొరేటర్

“ లైబ్రరీలు లేకపోయినా పన్ను వసూలు



నగరంలో రెండు డివిజన్లకు ఒక లైబ్రరీ ఉండాలి. కానీ నిబంధన అమలు కాకపోయినా పన్నులు వసూలు చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ భూములు, శ్మశానాలు, పార్కుల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వీటిని రక్షించాలి. నాసిరకంగా పనులు చేపట్టడంతో రోడ్లు వేసిన కొన్నిరోజులకే అధ్వానంగా మారుతున్నాయి.

– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ నాయకుడు

ముడుపులు ముట్టజెప్పాల్సిందే..

- నిజామాబాద్ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో దందా
- సైట్ ఇన్‌స్పెక్షన్ నుంచి టెక్నికల్, టైటిల్ విభాగాల వరకూ దోపిడీ పర్వం
- టీఎస్‌బీపాస్ ద్వారా భారీగా అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- తిరస్కరణకు గురైన దరఖాస్తుల డబ్బులు తిరిగివ్వని పరిస్థితి
- మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదని ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు భారీగా జీతాలు ఉన్నప్పటికీ.. చేస్తున్న పనులకు అందుకు పలు రెట్ల ముడుపులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీఎస్‌బీపాస్ కింద విలీన గ్రామాల ప్రజలు దరఖాస్తులు చేసుకుంటే అనుమతులు ఇచ్చే విషయంలో అధికారులు అవస్థలకు గురిచేస్తున్నారు. నగరంలోనూ అనుమతుల ప్రక్రియ సందర్భంగా ఇష్టారీతిన వ్యవహరిస్తూ దందా కొనసాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మచ్చుకు కొన్ని అంశాలను పరిశీలిస్తే ఇటీవల నిజామాబాద్ నగరంలోని ఓ ప్రాంతంలో టీఎస్‌బీపాస్ కింద నిర్మాణాల విషయంలో పక్కపక్కనే ఉన్న రెండు ప్లాట్లకు అన్ని సక్రమంగానే ఉన్నా ఒకదానికి అనుమతులిచ్చి, మరొకటి తిరస్కరిచడం గమనార్హం.

పైగా ఫీజుల వసూలు లోనూ పారదర్శకత లేకుండా వ్యవహరించడం విశేషం. 103 గజాల ప్లాట్‌కు సంబంధించి నిర్మాణం కోసం రూ. 79,340 ఫీజుగా వసూలు చేసి అనుమతి తిరస్కరించారు. కాగా 106 గజాల ప్లాట్‌కు సంబంధించి నిర్మాణం కోసం రూ.42,840 మాత్ర మే ఫీజు తీసుకుని అనుమతులిచ్చారు. ఇందు లో ఒక ప్రామాణికత పాటించకపోవడం గమనార్హం. సైట్ ఇన్‌స్పెక్షన్‌లో క్లియరెన్స్ వస్తే అనుమతులు ఇవ్వాల్సినప్పటికీ.. ఇవ్వకుండా పత్రాలు సక్రమంగా లేవంటూ సహేతుక కారణాలు చూపించకుండానే టెక్నికల్, టైటిల్ విభాగాల్లో సదరు దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు.

అంటే ఇక్కడ ప్రతి విభాగంలో దశలవారీగా ముడుపులు ఇస్తేనే అనుమతులు ఇచ్చే పరిస్థితి సృష్టించారు. ఇదిలా ఉండగా తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి డబ్బులు తిరిగిచ్చే విషయంలో పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు మధ్యవర్తులను పెట్టుకుని, సాంకేతిక అంశాలు తెలియని నాన్‌టెక్నికల్ వ్యక్తులతో దరఖాస్తులు చేయిస్తుండడంతో సమస్యలు వస్తున్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే రౌడీలకు, మాఫియాకు బెదిరేవిధంగా టౌన్ ప్లానింగ్ విభాగం వాళ్లకు ప్రజలు భయపడి తమ పేర్లు బయటకు రావద్దని చెబుతుండడం గమనార్హం.



విలీన గ్రామాల విషయంలో..

నిజామాబాద్ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో టీఎస్‌బీపాస్ కింద అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల ఇష్టారాజ్యం అయింది. గ్రామపంచాయతీకి చెల్లించిన పన్నుల జాబితా మేరకు ఇప్పటివరకు అనుమతులు ఇచ్చారు. గ్రామపంచాయతీలో నమోదు కానప్పటికీ ఆస్తి పన్ను కిందే ఉన్నప్పటికీ, అన్ని డాక్యుమెంట్లు తెచ్చినప్పటికీ ఈ స్థలాలు గ్రామ కంఠం కింద లేవంటూ నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు తిరస్కరిస్తున్నారు. 2020 కటాఫ్ దాటిందంటూ తిరస్కరించి దరఖాస్తుదారులను ఇబ్బందులు పెడుతున్నారు. లింక్ డాక్యుమెంట్లు లేవని, ఆస్తి పన్ను రిసిప్ట్‌లు సరిపోవని చెబుతూ పన్ను అసెస్‌మెంట్ రికార్డులు కావాలని చెబుతూ తిరస్కరిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో డీపీఎంఎస్ కింద దరఖాస్తు ఫీజు రూ.2,500 మాత్రమే ఉండేది. ప్రస్తుతం రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారు. తిరస్కరణకు గురైన వాటికి ఫీజు తిరిగి ఇవ్వడం లేదు. దరఖాస్తుదారులు మున్సిపాలిటీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే కనీసం సమాధానం కూడా రాని పరిస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. ఈ విషయాలపై నగరపాలక సంస్థ కమిషనర్ చిత్రా మిశ్రాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

ఏఐసీసీ ప్రతినిధుల జాబితాలో జిల్లా నేతలు

నిజామాబాద్ సిటీ: ఏఐసీసీ ప్రకటించిన ప్రతినిధుల జాబితాలో జిల్లా కాంగ్రెస్ నాయకులకు చోటు దక్కింది. జాబితాలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌లు ఉన్నారు. అలాగే కో ఆప్టెడ్ మెంబర్‌గా పీసీసీ కోశాధికారి, మాజీమంత్రి పి.సుదర్శన్‌రెడ్డిని నియమించారు.

అసెంబ్లీ ఇన్‌చార్జులుగా..
పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమిస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాలకు శశికళ యాదవ్‌రెడ్డి, బాల్కొండకు గోమస శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ గంధ్ర సుజాత, కోరుట్ల, జగిత్యాల్ నియోజకవర్గానికి గడుగు గంగాధర్‌లను ఇన్‌చార్జీలుగా నియమించారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

- ఎర్రజొన్నలకు మార్కెట్ ధర చెల్లించాలి
- సీడ్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్

ఖలీల్‌వాడి: ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ పంటను సేకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోళ్లు చేయాలన్నారు. ఎర్రజొన్న సాగుకు అవసరమైన విత్తనాల సరఫరా, రైతులతో ఒప్పందం కుదుర్చుకునే విధానం, విత్తనాల వెరైటీలు తదితర అంశాలపై వ్యాపారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి సేకరించిన ఎర్రజొన్న పంటను ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని, అక్కడ ఎర్రజొన్నను పశువులకు దాణాగా వినియోగిస్తారని సీడ్ కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతేడాది సాగు చేసిన పంటను పలువురు రైతులు కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకొని ఈ ఏడాది విక్రయించారని కలెక్టర్‌కు తెలిపారు. అయినప్పటికీ, ఈసారి అత్యధిక మంది మొక్కజొన్న పంట వైపు మొగ్గు చూపడంతో ఎర్రజొన్న సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ఫలితంగా ప్రస్తుతం మార్కెట్లో ఎర్రజొన్న పంటకు ఆశించిన రీతిలోనే మంచి డిమాండ్ ఉందని సీడ్‌ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. రైతులతో కుదుర్చుకున్న ఒప్పందానికి మించి ఎర్రజొన్నకు ఎక్కువ మొత్తంలో ధర పలుకుతోందన్నారు. ఎలాంటి సమస్యలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సీడ్ ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సీడ్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెంచాలి

- జూమ్ మీటింగ్‌లో మంత్రి హరీశ్‌రావు

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ప్రసవాలు పెరిగాయని, ఇంకా మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మంత్రి ఆస్పత్రి వైద్యులకు ప్రసవాలపై సూచనలు చేశారు. గర్భిణులకు వైద్యులు ఒక బర్త్ ప్లానింగ్ ప్రకారం సూచనలు చేయాలని పేర్కొన్నారు. గర్భిణులకు వైద్యులు సమయానుకూలంగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. డిశ్చార్ అయ్యే సమయంలో వారిని సంపూర్ణంగా పరీక్షించిన తర్వాతే ఇంటికి పంపాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు 88శాతం ప్రసవాలు పెరిగాయని, ఇదంతా ప్రభుత్వ వైద్యులపై నమ్మకంతోనేనన్నారు. మిగతా 12శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాకుండా ప్రైవేటులో జరుగుతున్నాయన్నారు. దీనికి గల కారణాలు ఏమిటని, ఈ 12 శాతంలో ధనికులు ఉన్నారా, పేద వారు ఉన్నారా అనేది గుర్తించి వందశాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలకు సంబంధించి వైద్యులు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అయినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా పనితీరు ఉండాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే ఆస్పత్రిలో డెత్ ఆడిట్‌లు నిర్వహించి మరణాల రేటును తగ్గించాలన్నారు. మీటింగ్‌లో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, హెచ్‌వోడీలు, వైద్యులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న జీజీహెచ్ ఆస్పత్రి వైద్యులు

దళారులకు విక్రయించొద్దు..

- జిల్లాలో 12 శనగ కొనుగోలు కేంద్రాలు
- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

రెంజల్(బోధన్): రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా 12 శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోనే మొదటగా రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో సోమవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొందరపడి దళారులకు శనగలు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ మద్దతు ధరను అందించే కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలన్నారు. 10 నుంచి 15 రోజుల్లో శనగలు విక్రయించిన రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. గతంలో ఉన్న ఎకరాకు 5 క్వింటాళ్ల పరిమితిని ఆరున్నర ఎకరాలకు పెంచడం జరిగిందన్నారు.

యూరియా కొరత రానివ్వం
తెలంగాణలోనే ఫర్టిలైజర్ వినియోగంలో జిల్లా అగ్రస్థానంలో ఉందని మార గంగారెడ్డి పేర్కొన్నారు. ఎంతగా అలాట్‌మెంట్ చేసినా అక్కడక్కడా కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమైనా ఢిల్లీలోని ఇఫ్కో, క్రిబ్‌కో అధికారులతో మాట్లాడి జిల్లాకు రప్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్లు ఇమాంబేగ్, భూంరెడ్డి, మొహియొద్దీన్, సర్పంచ్‌లు ఖలీంబేగ్, రమేశ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార గంగారెడ్డి

ప్రజావాణికి 80 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

ఖలీల్‌వాడి: ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావానికి 80 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో చందర్‌నాయక్ ఫిర్యాదులను స్వీకరించారు. ధర్పల్లి మండలం రామడుగు గ్రామానికి చెందిన మమత, సిరికొండ మండలం హోన్నాజీపేటకు చెందిన గాండ్ల గంగారాం, ధర్పల్లికి చెందిన బోదాసు లక్ష్మి పట్టదారు పాస్‌పుస్తకాలు రాలేదని ఫిర్యాదు చేశారు. వేల్పూర్ మండలం సాయంపేట్ గ్రామంలో 29 ఎకరాల 18 గుంటల భూమి కోనుగోలు చేశామని, ఈ భూమిని కొందరు కబ్జా చేశారని ఆర్మూర్‌కు చెందిన రిటైడ్ ఎంఈవో కొండి విఠల్ ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలి: ఎంబీటీ

నగరంలోని మాలపల్లిలో గల ప్రభుత్వ భూములను రక్షించాలని ఎంబీటీ నేతలు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. మెదక్ జిల్లాలో ఖదీర్‌ఖాన్ మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాత కలెక్టర్‌లోని మసీదు భూమిని మైనార్టీలకు అందించాలని కోరారు. అబ్దుల్‌ఖాదర్‌సాజిద్, మహమ్మద్ జహీరోద్దీన్, మీర్ బషరత్‌అలీ, మహమ్మద్‌ఫరూక్ ఉన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.26వేల వేతనం అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు గేట్లను మూసివేశారు. సీఐ జగడం నరేష్, ఎస్సై సాయికుమార్ గౌడ్ సముదాయించి ఇన్‌చార్జి డీపీవోకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకురాలు విజయలక్ష్మి, నూర్జహాన్ పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు ఇవ్వాలి

మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలన్నారు. మృతి చెందిన మహిళలకు లోన్‌లు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి, కర్నాటి సంధ్యారాణి, శంకుతల పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మించాలి

నగరంలోని ఆర్టీసీ కాలనీలో డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీ ఏర్పాడి ఏళ్లు గడుస్తున్నా డ్రెయినేజీ ఏర్పాటు చేయలేదన్నారు. రాజేందర్, కిషన్, విశ్వనాథ్, శ్యాం, వేణు, కిరణ్, గంగకిషన్ ఉన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బిచ్కుంద: రామరాజ్యం పేరుతో పేదల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బిచ్కుంద మండలంలో గుండె నెమలి, పుల్కల్ మీదుగా బిచ్కుంద వరకు బీఎస్పీ చేపట్టిన పాదయాత్రలో సోమవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం బిచ్కుందలో విలేకరులతో మాట్లాడారు. కంటి వెలుగు పథకం ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కొండ పోచమ్మ సాగర్ కాలువ ప్రారంభించిన గంటకే కొట్టుకుపోయిందని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన నాసిరకం పనులకు ఇది నిదర్శనమన్నారు. జుక్కల్ నియోజక వర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ ఉన్నా ఇక్కడి ప్రజలకు చుక్క నీరు అందడం లేదన్నారు. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, సాయిలు, గంగారాం, సురేష్‌గౌడ్, ప్రజ్ఞసాగర్, తుకారం, బోగడ మీది సాయిలు పాల్గొన్నారు.

హన్మాజీపేట్‌లో ఉద్రిక్తత

బాన్సువాడరూరల్: బాన్సువాడ మండలం హన్మాజీపేటలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సోమవారం గ్రామంలో బీజేపీ నాయకులు నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. పోచారంను విమర్శిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగడంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను శాంతింపచేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, నాయకులు మల్యాద్రి రెడ్డి తదితరులు మాట్లాడి సభను ముగించారు. బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని బీజేపీ నాయకులు అన్నారు.

‘గూండాయిజాన్ని పెంచి పోషిస్తున్న బీఆర్ఎస్’


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య

వర్ని: రాష్ట్రంలో గూండాయిజాన్ని, రౌడీయిజాన్ని బీఆర్ఎస్ పెంచి పోషిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య ఆరోపించారు. సోమవారం మండలంలోని జలాల్పూర్‌లో ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకనుంచి ఎవరైనా బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోమన్నారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, ఈ విషయాలను గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్యాద్రిరెడ్డి, హుస్సేన్, శంకర్, గోవర్ధన్, రమేష్, జనార్దన్, దత్తు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

తెయూ(డిచ్‌పల్లి): మానవ అక్రమ రవాణాను అరికట్టడం ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా భావించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ రిసోర్స్ పర్సన్ షాబిన్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ), డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ), తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ‘మానవ అక్రమ రవాణా’ అనే అంశంపై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. ప్రతిరోజూ జరిగే మానవ అక్రమ రవాణాలో 70శాతం మంది మహిళలు, బాలికలు, చిన్నారులు ఉంటున్నారని తెలిపారు. మహిళలు, బాలికలను లైంగిక దోపిడికి గురి చేస్తున్నారని, పిల్లలను వికలాంగులుగా మార్చి భిక్షాటన, ఇళ్లల్లో బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ అక్రమ రవాణా, మహిళలు, చిన్నారులపై లైంగిక దోపిడి నుంచి రక్షణ పొందటానికి ఉన్న చట్టాలు, వాటి ప్రాముఖ్యత గురించి ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ రిసోర్స్ పర్సన్స్ శేరోన్ డానియల్, కరుణాకర్, షాబిన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, హెచ్‌వోడీ స్రవంతి, అధ్యాపకులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించాలి



ఖలీల్‌వాడి: సీఎం కేసీఆర్‌ను గద్దెదించే వరకు బీజేపీ కార్యకర్తలు పోరాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కంఠేశ్వర్ గోదాంరోడ్డులో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. నిజామాబాద్ కోసం బిగాల గణేశ్‌గుప్తా ఏం చేశారని ప్రశ్నించారు. మారంపల్లి గంగాధర్, రోషన్‌లాల్‌బోర, నాగోల లక్ష్మీనారాయణ, శ్రీధర్, శ్యామ అగర్వాల్, శ్యామ్ తివారి పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు


సదస్సు ఆహ్వాన పత్రాన్ని వీసీ రవీందర్‌కు అందజేస్తున్న కోఆర్డినేటర్ ప్రవీణ్, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు (21, 22, 23వ తేదీల్లో) అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి హాజరవుతారని, వీసీ డి రవీందర్ అధ్యక్షత వహిస్తారని సదస్సు కోఆర్డినేటర్ ప్రవీణ్ మామిడాల తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం సదస్సు ఆహ్వానపత్రాన్ని కోఆర్డినేటర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో విభాగం అధ్యాపకులు వీసీ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, అధ్యాపకులు కిరణ్మయి, జవేరియా ఉజ్మా, ప్రసన్నశీల, పీఆర్‌వో జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ క్రీడల కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఉద్యోగులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21 నుంచి 25 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. సోమవారం క్రీడల కరపత్రాలను ఆవిష్కరించారు. క్రీడల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, షకీల్, జెడ్పీ చైర్మన్ విఠల్, మేయర్ నీతూకిరణ్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమృత్‌కుమార్, ఆకుల ప్రసాద్ పాల్గొన్నారు.

మార్చురీ అటెండెన్స్ గది నిర్మాణం పూర్తి


జీజీహెచ్‌లో నిర్మించిన మార్చురీ అటెండెన్స్ గది

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జీజీహెచ్‌లో మార్చురీ అటెండెన్స్ గది నిర్మాణం పూర్తి అయింది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ తరహా గది లేదు. రూ.5లక్షల 50వేలతో ఈ గదిని నిర్మించారు. జనరల్ ఆస్పత్రికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి మృతదేహాలు పోస్టుమార్టమ్ కోసం వస్తాయి. ఉదయం సమయంలో వచ్చే మృతదేహాలకు అదే రోజు పోస్టుమార్టమ్ పూర్తి చేసి అప్పగిస్తారు. ఒక్కోసారి సాయంత్రం లేదా, రాత్రి వేళలోనూ వస్తాయి. పోస్టుమార్టం పూర్తి అయ్యే సంబంధించిన వారు ఇంతవరకు బయట ఉండేవారు. వారి కోసం ఈ గదిని నిర్మించారు.

కొడుకును చంపారనే కోపంతో..

- నిందితుడిపై దాడి
- కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: కొడుకును హత్య చేసిన వారిని ఎలాగైనా చంపాలని తండ్రి కక్ష పెంచుకున్నాడు. ఇందులో భాగంగా ఒకరిపై కత్తితో దాడి చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ సోమవారం వెల్లడించిన వివరాలు.. నగరానికి చెందిన చాట్ల గోపి అలియాస్ షాపురం గోపి కుమారుడు శివ జనవరిలో హత్యకు గురయ్యాడు. మానే శివకుమార్‌తో పాటు మరో నలుగురు శివను చంపారని, వారిని చంపాలని గోపి పథకం పన్నాడు. ఇందులో భాగంగా అతడి స్నేహితుడు మన్నె ప్రకాశ్ సాయంతో ఈ నెల 16న సుభాష్‌నగర్‌లోని నిర్మలాహృదయ స్కూల్ చౌరస్తాలో మానే శివకుమార్‌పై కత్తితో దాడి చేశాడు. శివకుమార్ తప్పించుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం హమాల్‌వాడిలో నిందితులు గోపి, ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులు వినియోగించిన కత్తి, మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన పోలీసులను ఏసీపీ అభినందించారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై శ్రావణ్ కుమార్, ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై రాములు, కానిస్టేబుల్ ఆఫ్సర్, వెంకట్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా కవిత తోరాన్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ (భిక్కనూర్) ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ కవిత తోరాన్ నియామకమయ్యారు. వీసీ రవీందర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం కవిత తోరాన్‌కు వీసీ నియామక పత్రం అందజేశారు.

పీజీ సెమిస్టర్ పరీక్ష తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 24న ప్రారంభం కావాల్సిన పీజీ మొదటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ కోర్సులకు సంబంధించి మొదటి, మూడో సెమిస్టర్స్, ఎల్ఎల్‌బీ, ఐఎంబీఏ కోర్సులకు సంబంధించి 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

కవితలకు ఆహ్వానం

బోధన్: ఉగాది సందర్భంగా పంపా సాహితీ పీఠం బోధన్ ఆధ్వర్యంలో పంపా తరంగాలు కవిత సంకలనం పుస్తకాన్ని ముద్రించనున్నట్లు పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురాణే అజయ్ కుమార్, పబ్బ మురళి ప్రకటనలో తెలిపారు. ఈ సంకలనానికి జిల్లాలోని కవులు, రచయితల నుంచి కవితలు, పద్యాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆచారాలు సంప్రదాయాలు, భాషలు అంశాలపై 20 పంక్తులకు మించకుండా కవితలు, పద్యాలను ఈ నెల 28 వరకు 9441471400 నంబర్‌కు వాట్సాప్‌లో పంపాలని కోరారు. కవితతో పాటు ఫొటో, హామీ పత్రం జత చేయాలని సూచించారు. వివరాలకు 9440181487 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు సైన్స్ ప్రతిభ పరీక్ష

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి భౌతిక రసాయనశాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివప్రసాద్, రఘునాథ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు.

హార్వెస్టర్ ఢీకొని మృత్యువాత


ప్రేమ్‌దాస్(ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ శివారులో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రాంగ్‌రూట్‌లో వస్తున్న హార్వెస్టర్ ఢీకొనడంతో ఇందల్వాయి తండాకు చెందిన బాదావత్ ప్రేమ్‌దాస్ (45) మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి తండాకు చెందిన ప్రేమ్‌దాస్ పోచంపాడ్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అర్గుల్‌లో శివారులో జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వచ్చిన హార్వెస్టర్ ఢీకొంది. ప్రేమ్‌దాస్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లిలో సోమవారం పాగాకు రాజయ్యకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని వ్యవసాయబావి వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిందన్నారు. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పశువుల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

రుద్రూర్: రుద్రూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్, వర్ని మండలం షైడిమల్, పోతంగల్ మండల కేంద్రంలో పశువులు దొంగలించి తప్పించుకు తిరుగుతున్నారు. మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వరుసగా గెదేల చోరీలు జరుగుతున్నందున నిఘా పెట్టి పోలీసులు ఎట్టకేలకు పోతంగల్ గ్రామానికి చెందిన సయ్యద్ మోసీన్, బాబా కురేషీని అదుపులోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురితో కలిసి గెదేలు దొంగలించినట్టు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.2.11 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

క్రైం కార్నర్

కొడుకును హత్య చేసిన తండ్రికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: పది నెలల కుమారుడిని హత్య చేసిన తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల సోమవారం తీర్పు వెల్లడించారు. నగరంలోని మూడో టౌన్ పోలీసులు కోర్టుకు సమర్పించిన అభియోగాల ప్రకారం సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. కేసు వివరాలు.. నగరంలోని దుబ్బ ప్రాంతంలోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ చెందిన కతుల్వార్ కృష్ణవేణి, బాలాజీ భార్యాభర్తలు. వీరికి 10 నెలల కుమారుడు ప్రశాంత్ ఉన్నాడు. బాలాజీ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. భార్యకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ వేధించేవాడు. 2014 ఆగస్టు 7న రాత్రి భార్యతో గొడవపెట్టుకుని కోపంతో పదినెలల కొడుకును నేలకేసి కొట్టాడు. దీంతో బాలుడు చనిపోయాడు. హత్య నేరం రుజువు కావడంతో ముద్దాయి బాలాజీకి జీవిత ఖైదుతోపాటు రూ.రెండు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ వాదించారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి



ఇందల్వాయి: ఇందల్వాయికి చెందిన ఐదేళ్ల బాలుడు హైదరాబాద్‌లో ఆదివారం కుక్కల దాడిలో గాయపడి మృతి చెందిన ఘటన స్థానికులను విస్మయానికి గురిచేసింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన గంగాధర్ హైదరాబాద్‌లోని ఓ కార్ షోరూంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం తన ఐదేళ్ల కుమారుడు ప్రదీప్‌ని కూడా వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఆడుకుంటున్న ప్రదీప్‌పై కుక్కలు దాడిచేసి గాయపర్చడంతో ప్రదీప్ మృతి చెందినట్లు వారు తెలిపారు.

పొయ్యి వెలిగిస్తుండగా అంటుకున్న మంటలు

- చికిత్స పొందుతూ వివాహిత మృతి

రెంజల్: కట్టెల పొయ్యి వెలిగిస్తుండగా మంటలు అంటుకొని గాయపడ్డ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై పండ్ల సాయన్న తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన స్వాతి(21), ప్రసాద్ దంపతులు కూలీ పనులు చేసుకోడానికి రెంజల్‌కు వలస వచ్చారు. రెంజల్ శివారులో ఉంటున్నారు. ఈ నెల 14న స్వాతి డీజిల్ పోసి కట్టెల పొయ్యి వెలిగించే క్రమంలో మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. భర్త ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్ తండా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మీసాల దశరథం(44)సోమవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మీసాల దశరథం ఆర్మూర్‌లో చేపలు తీసుకురావడానికి టీవీఎస్ ఎక్సెల్‌పై బయలు దేరాడు. బాలానగర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన అశోక్ లీలాండ్ వాహనం ఢీకొట్టింది. గాయపడ్డ దశరథంను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దశరథం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గల ఆర్కె కాంప్లెక్స్‌లో ఆదివారం దొంగలు పడ్డారు. కాంప్లెక్స్‌లోని సాయికృప ఆన్‌లైన్ సెంటర్, సాయి మీ సేవ సెంటర్‌ల తాళాలను ధ్వంసం చేసి రెండు దుకాణల్లో రూ.6వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే ఓ బట్టల దుకాణం తాళాలను ధ్వంసం చేశారు. ఎస్సై రాము ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

పట్టపగలే దొంగతనం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో సోమవారం పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న లక్ష్మి ఉదయాన్నే ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసే సరికి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లినట్లు గమనించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గణేష్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు తమకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని ఎస్సై గణేష్ తెలిపారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు


పీడీయాక్ట్ నమోదు పత్రాలను అందజేస్తున్న పోలీసులు

కామారెడ్డిటౌన్: ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించి చంపేసిన ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు.. గతేడాది సెప్టెంబర్‌లో కామారెడ్డికి చెందిన ఒక మహిళ వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించి గాంధారి మండలం తిమ్మాపూర్ శివారులోకి తీసుకు వెళ్లి కాల్చి వేశారు. వీరిపై గాంధారి ఠాణాలో పలు కేసులు నమోదు అయ్యాయి. కామారెడ్డి చెందిన ఏ1 నిందితుడు వీరమల్లు రమేష్, అతని భార్య ఏ2 నిందితురాలు వీరమల్లు యశోద అలియాస్ హారికను అరెస్టు చేసి కోర్టుకు పంపామన్నారు. వారు బెయిల్‌పై విడుదల కాగా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఉత్తర్వులను అందజేశామన్నారు. నిందితులకు సదాశివనగర్ సీఐ రామన్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు.

గంజాయి స్వాధీనం


బోధన్‌లో పట్టుకున్న గంజాయితో అధికారులు

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో సోమవారం ఎక్సైజ్ అధికారులు మోతుకూరి వెంకట్ వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా వెంకట్ పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఖలీల్‌వాడి: నగరంలోని బాబాన్‌సాహెబ్‌పహాడ్ వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా షైక్ హాజీ వద్ద 650 గ్రాముల గంజాయి దొరికినట్లు నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మధుసూదన్ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకొని, షైక్‌హాజీని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, కానిస్టేబుళ్లు షబ్బీర్, ప్రభాకర్, సంగయ్య, రవి, మోహన్ సింగ్ పాల్గొన్నారు.

కాలూర్‌లో కల్లు శాంపిళ్ల సేకరణ

నిజామాబాద్ రూరల్ మండలం కలూర్ కల్లు డిపోలో కల్లుసీసాలో ఎలుక రావడంతో శాంపిళ్లు సేకరించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మధుసూదన్ తెలిపారు. రిజల్ట్ వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరి దగ్గర నుంచి 120 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై సింధు సోమవారం తెలిపారు. కల్లు బట్టీలో కల్లు తాగేందుకు వెళ్లిన్న ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌కు చెందిన షేక్ ఇంతియాజ్, నవీపేటలోని ధర్యాపూర్‌కు చెందిన పురుషోత్తం దగ్గర తనిఖీలు చేయగా ఈ గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.

రెస్టారెంట్‌పై దాడి

నవీపేటలోని ఓ రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సింధు తెలిపారు. అనుమతులు లేని రెస్టారెంట్‌లో నిషేధిత మద్యం తాగుతున్న స్టేషన్ ఏరియాకు చెందిన వీరేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేట్ స్కూల్ బస్సు

- విద్యార్థులకు స్వల్పగాయాలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం లింగాయిపల్లి శివారులో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు చెట్టును ఢీకొంది. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన బస్సు సాయంత్రం స్కూల్ సమయం ముగిశాక విద్యార్థులను తీసుకుని బయలుదేరింది. లింగాయిపల్లికి వెళ్తుండగా గ్రామ శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 నుంచి 40 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. విద్యార్థుల ఆరుపులు విని స్థానికులు బస్సు వద్దకు చేరుకుని విద్యార్థులను క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.